
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 కనిష్ఠం 22.8



నిర్మల్ జిల్లా వార్తలు

8

సోమవారం 18 మార్చి 2024



రహస్య మంత్రాంగం!

- పావులు కదుపుతున్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు
- మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌తో ఇంద్రకరణ్ రెడ్డి మంతనాలు
- నిర్మల్‌లో సాగిన సుదీర్ఘ చర్చలు
- ఇప్పటికే అసంతృప్తితో ఉన్న రాథోడ్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సమీకరణలను తలకిందులు చేసేందుకు వ్యూహరచన
- హస్తం వైపే అందరి దృష్టి

నిర్మల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాజకీయ సమీకరణలు క్రమంగా మలుపులు తిరుగుతున్నాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లోని అసంతృప్తి, అసమ్మతి నాయకులు అంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు భారీగా స్కెచ్ వేస్తున్నారు. వీరంతా మూకుమ్మడిగా ఒకేసారి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సీరియస్‌గా సమాలోచనలు జరుపుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. గత శనివారం నిర్మల్‌లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో బీజేపీకి చెందిన మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ దాదాపు గంటకు పైగా రహస్యంగా చర్చలు జరిపినట్లు విశ్వసనీయ సమాచారం. బీజేపీ తరపున లోక్‌సభ అభ్యర్థిత్వాన్ని ఆశించి భంగపడ్డ రమేష్‌రాథోడ్ మూడురోజుల క్రితం ఉట్నూర్‌లో తన అభిమానులతో సమావేశమై భవిష్యత్ కార్యచరణపై చర్చించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో సమావేశం కావడం ప్రస్తుతం ప్రాధాన్యతనిస్తోంది. ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన మూడు నియోజకవర్గాల బీఆర్ఎస్ ముఖ్యనేతలు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కార్యకర్తలు ఒకేసారి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. వీరంతా తమతోపాటు బీజేపీలోని అసంతృప్తి నాయకులను సైతం వెంట తీసుకువెళ్లాలన్న వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. ఇందులో భాగంగానే వారు టికెట్ రాకుండా అసంతృప్తితో ఉన్న రాథోడ్ రమేష్‌తో చర్చలు జరుపుతున్నారని చెబుతున్నారు. అయితే ఈ సమావేశంపై రాథోడ్‌రమేష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో రాథోడ్ జరిపిన చర్చల వ్యవహారం ఇక్కడి రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇదిలా ఉండగా ఇప్పటికే లోక్‌సభ అభ్యర్థులను ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ పార్టీలు ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఇప్పటి వరకు తన అభ్యర్థిని ప్రకటించలేదు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ బలమైన నేత కోసం అన్వేషణ జరుపుతోందంటున్నారు. బీజేపీ టికెట్ దక్కని సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు చెబుతున్నారు. ఇటు రాథోడ్ రమేష్, అటు సోయం బాపురావులు కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశాలున్నాయన్న ప్రచారం కూడా సాగుతోంది. పార్టీ మార్పు విషయమై వీరిద్దరు ఇప్పటి వరకు ఎక్కడ కూడా నోరు విప్పకున్నా కార్యకర్తలతో వీరిద్దరూ జరుపుతున్న చర్చలు, మంతనాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.




మాజీ మంత్రి వ్యవహార శైలిపై ఉత్కంఠ

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పెద్దఎత్తున ప్రయత్నాలు చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటివరకు ఇంద్రకరణ్‌రెడ్డి మాత్రం తాను కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించకపోయినా ఇటీవల జరిగిన పార్టీ కీలక సమావేశానికి ఆయన హాజరుకాకుండా తన అంతరంగాన్ని పరోక్షంగా బయటపెట్టారని అంటున్నారు. ఆయన ఇప్పటికే పలువురు సీనియర్ నేతలతో రహస్యంగా మంతనాలు జరిపి ఓ నిర్ణయానికి వచ్చారని చెబుతున్నారు. ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆ పార్టీలోని పలువురు నేతలు, వ్యతిరేఖ వర్గీయులు అడ్డుకుంటున్న సంగతి తెలిసిందే. వారం రోజుల నుంచి నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇంద్రకరణ్‌రెడ్డిని ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ వారంతా డిమాండ్ చేస్తూ ధర్నాలు నిర్వహిస్తున్నారు. దీనిపై డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వారు ప్రత్యేకంగా వినతిపత్రం సైతం అందించారు. అలాగే ఉట్నూర్‌లో మంత్రి సీతక్కకు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు సైతం ఐకెరెడ్డికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయడమే కాకుండా ఆయనను పార్టీలో చేర్చుకోవద్దంటూ ఆయనపై ఉన్న ఆరోపణల కారణంగా పార్టీకి నష్టం జరుగుతుందంటూ వివరించారు. అలాగే సోషల్ మీడియాలో సైతం ఇంద్రకరణ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక వ్యవహారంపై పెద్దఎత్తున వ్యతిరేక ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఖానాపూర్‌ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఇక్కడి నేతలు, కార్యకర్తలకు ఇంద్రకరణ్‌రెడ్డి చేరిక విషయమై స్పష్టతనిచ్చారు. దీంతో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ఊపిరి పీల్చుకుంటున్నప్పటికీ మారుతున్నా సమీకరణలు వారిని టెన్షన్‌కు గురి చేస్తున్నాయంటున్నారు.

రాథోడ్ మంతనాల మర్మమేమిటో..

మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌తో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గత శనివారం నిర్మల్‌లో జరిపిన మంతనాల వ్యవహారం రాజకీయ వర్గాల్లో ఆసక్తికి కారణమవుతోందని అంటున్నారు. దాదాపు గంటకు పైగా వీరు తమ రాజకీయ భవిష్యత్ కార్యచరణపై చర్చలు జరిపారంటున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధిష్ఠానంపై తీవ్రఅసంతృప్తితో ఉండడమే కాకుండా పార్టీ మారేందుకు సిద్ధమవుతున్న ఇంద్రకరణ్‌రెడ్డి అలాగే బీజేపీ తరపున లోక్‌సభ టికెట్ దక్కక అసమ్మతితో ఉన్న రాథోడ్ రమేష్ మూకుమ్మ డిగా తమ అభిమానులు, అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేస్తున్నారన్న ప్రచారం మొదలైంది. వీరితోపాటు ముథోల్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అలాగే మరికొంతమంది రెండు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. కోనప్ప ప్రస్తుతం వీరందరిని సమీకరించి పార్టీలో చేర్పించేందుకు కృషి చేస్తున్నారంటున్నారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేరిక విషయంలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వెల్లడవుతున్నందున ఆయనను కాంగ్రెస్‌పార్టీ అధిష్ఠానం పార్టీలో చేర్చుకుంటుందో లేదోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళనలు అధిష్ఠానం ఏ మేరకు పరిగణలోకి తీసుకుంటుందోనని పలువురు చర్చించుకుంటున్నారు.



నేటి నుంచి పది పరీక్షలు



- 5 నిమిషాల వరకు ఆలస్యానికి అనుమతి
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు

నిర్మల్ కల్చరల్, మార్చి17: పదో తరగతి విద్యార్థుల పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తిచేసింది. ఉదయం 9:30 నుంచి పరీక్ష మొదలవుతుంది. విద్యార్థులు పరీక్షకు సకాలంలో హాజరుకావాలి. 5నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చినా అనుమతించనున్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని అధికారులు వెల్లడించారు. పరీక్షకేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటుచేశారు. సీసీ కెమెరాల నిఘాలో కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో 47 పరీక్ష కేంద్రాల్లో 8,923 మంది విద్యార్థులు హాజురుకానున్నారు. కేంద్రాల్లోకి విద్యార్థులు చరవాణిలు తీసుకురాకూడదని విద్యాశాఖ అధికారులు సూచించారు. అధికారులతోపాటు సూపరింటెండెంట్లు, ఉపాధ్యాయులు, పరీక్ష నిర్వాహకులు సైతం చరవాణిలు వినియోగించవద్దని స్పష్టంచేసింది. ఫ్లయింగ్‌స్క్వాడ్ ఎప్పకటిప్పుడు పరీక్షకేంద్రాలను తనిఖీలు చేస్తోంది. సిట్టింగ్‌స్క్వాడ్‌ను కూడా కేంద్రాలలో ఏర్పాటుచేశారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. హాల్‌టికెట్లు అందని విద్యార్థులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరుకావచ్చని పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ తెలిపారు.

భైంసాలో 91 వాహనాల సీజ్

భైంసా, మార్చి17: పట్టణంలోని రాహుల్‌నగర్ కాలనీలో ఆదివారం పోలీసుశాఖ నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాంలో భాగంగా టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో 60మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది కాలనీలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని 86 బైకులు, త్రీ, ఫోర్ వీవిల్లర్స్, 2 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనపరుచుకున్నారు. కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం సందర్భంగా కాలనీవాసులతో టౌన్ సీఐ రాజారెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. తల్లితండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. సైబర్‌క్రైమ్ పట్ల అప్రమత్తతతో ఉండాలని సూచించారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న టౌన్ సీఐ రాజారెడ్డి

అడెల్లి పోచమ్మకు ప్రత్యేక పూజలు

సారంగాపూర్, మార్చి 17: మండలంలోగల అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. దీవిం చమ్మా పోచమ్మతల్లి అంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయంలో మొక్కలు తీసుకోవడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. భక్తులు అమ్మవారికి పెరుగన్నం నైవేద్యంగా సమర్పించారు. భక్తుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇన్‌చార్జి ఈవో రంగురవికిషన్‌గౌడ్ చర్యలు చేపట్టారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



బాధిత కుటుంబీకులతో మాట్లాడుతున్న ఐకేరెడ్డి

మాజీ ఎంపీపీ అంత్యక్రియలకు హాజరైన మాజీ మంత్రి అల్లోల

సారంగాపూర్, మార్చి17: మండలంలోని జౌళిలో అనారోగ్యంతో మృతిచెందిన మాజీ ఎంపీపీ హేమలత అంత్యక్రియలకు ఆదివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హాజరయ్యారు. మృతికి గల కారణాలను గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట నాయకులు అల్లోల మురళీధర్ రెడ్డి, రాంకిషన్ రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవ్ రావులతోపాటు మాజీ సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.

పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఉన్నత శిఖరాలకు చేరొచ్చు

ఖానాపూర్, మార్చి17: విద్యార్థి దశలోనే పిల్లలు పట్టుదల, క్రమశిక్షణను అలవర్చు కుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యనారాయణ అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని ఆర్య స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్‌పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్, తదితరులు ఉన్నారు.

కవి మునిమడుగులకు సన్మానం

నిర్మల్ కల్చరల్, మార్చి17: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, తాత్విక వేత్త మునిమడుగుల రాజారావును ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో పాలపిట్ట పాఠకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో గత రెండున్నర దశాబ్దాలుగా రాజారావు చేస్తున్న రచనా వ్యాసాంగాన్ని పాఠకులు, కవులు కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక గౌరవ సలహాదారు డాక్టర్ దామెర రాములు, అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, ప్రధాన కార్యదర్శి వెంకట్, తుమ్మల దేవరావు, కవులు తదితరులున్నారు.



కవి మునిమడుగులను సన్మానిస్తున్న కవులు

ఖానాపూర్‌లో అకాల వర్షం

- ఈదురు గాలులతో కురిసిన వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న

ఖానాపూర్, మార్చి 17: ఖానాపూర్ మండలంలోని శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షం తమను ఎంతో నష్టం చేసిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతోపాటు భారీగా ఈదురు గాలులు రావడంతో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని దిలావర్‌పూర్, తర్లపాడ్, సత్తనపెల్లి తదితర గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కజొన్న పంట నేలకొరిగింది. దీంతో చివరి దశలో ఉన్న మొక్కజొన్న పంట నేలకొరగడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క పిందె దశలో ఉన్న మామిడి పంటకు, చేతికి అందిన మిరప పంటకు సైతం ఈ ఈదురు గాలులు భారీ నష్టం కలిగించాయని రైతులు చెబుతున్నారు.



దిలావర్‌పూర్ శివారులో నేలకొరిగిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు



అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అమ్మవారిని దర్శించుకున్న పలువురు నేతలు

బాసర, మార్చి17: బాసర సరస్వతి అమ్మవారిని ఆదివారం పలువురు బీజేపీ నాయకులు దర్శించుకున్నారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, కార్యదర్శి శరత్‌సింగ్, కార్యవర్గ సభ్యుడు బాజీరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారి వెంట ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు స్వామియాదవ్, భైంసా పట్టణ కౌన్సిలర్ రావుల పోశెట్టి, బీజేపీ నియోజకవర్గ నాయకులు రాజశేఖర్, బాసర బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుభాష్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

దిగుబడుల జోరు.. ధరలు లేక బేజారు!

- డిమాండ్ కంటే అధికంగా ఆకు కూరల దిగుబడులు
- ధర లేక తక్కువ ధరకే విక్రయిస్తూ నష్టపోతున్న రైతులు

భైంసా, మార్చి 17: ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఆశించిన దిగుబడులను, లాభాలను పొందాలని జిల్లా రైతాంగం రబీ సీజన్‌లో ఆరుతడి పంటలో సాగులో భాగంగా కూరగాయాల వైపు దృష్టిసారించింది. ఇందులో భాగంగానే తక్కువ వ్యయం, స్వల్పకాలంలో దిగుబడులు వచ్చే పాలకూర, మెంతి కూర లాంటి ఆకుకూరలను అధికమొత్తంలో సాగు చేశారు. ప్రస్తుతం శీతలగాలుల ప్రభావంతో వీటి దిగుబడులు ఆశానజకంగా వచ్చాయి. ఈ క్రమంలో మార్కెట్‌కు విక్రయించే పాలకూర, మెంతికూర, కొత్తిమీర దిగుబడులు అధికమొత్తంలో వస్తున్నాయి. డిమాండ్ కంటే మూడు నుంచి నాలుగురేట్లు అధికంగా ఆకుకూరలు మార్కెట్ వస్తుండటంతో వీటి ధరలు తగ్గిపోయాయి. ఇదివరకు ఒక్కోపాలకూర కట్ట రూ.10తో లభ్యమవ్వగా ఇప్పుడు దిగుబడులు అధికంగా మార్కెట్‌కు వస్తుండటంతో ధర తగ్గిపోయి రూ.10కు రెండు కట్టలు లభ్యమవుతున్నాయి. ఇక మెంతికూర ధర పరిస్థితి మరింత తగ్గిపోయింది. 10 రోజుల క్రితం ఒక కట్ట రూ.15లకు లభ్యమవ్వగా ఇప్పుడు మూడు కట్టలు వస్తున్నాయి. దిగుబడులు జోరుగా ఉన్నప్పటికీ ధరలు లేక కూరగాయాలు సాగుచేస్తున్న రైతులు బేజారవుతున్నారు. అమ్మబోతే అడవి.. కొనబోతే కొరవి అన్న చందగా మారిందని రైతులు వాపోతున్నారు. స్థానిక మార్కెట్‌కు వారం రోజులుగా ఆకుకూరలు అధికమొత్తంలో వస్తుండటంతో వాటిని విక్రయించేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. వచ్చిన ధరకే విక్రయించి ఇంటిదారి పడుతున్నారు. తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నామని రైతులు చెప్తున్నారు.



మార్కెట్‌లో ఆకుకూరలు విక్రయిస్తున్న రైతు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం

భైంసాలో నేటి నుంచి లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- సర్వంగా సుందరంగా ముస్తాబైన ఆలయం
- పూర్తయిన ఉత్సవ ఏర్పాట్లు

భైంసా, మార్చి17: పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ జ్యువెల్లరీ మార్కెట్ పరిధిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో సోమవారం నుంచి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహక కమిటీ ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్నిఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాలలో భాగంగా యజ్ఞం నిర్వహించేందుకు యాగశాలను నిర్మించారు. రాత్రి వేళలో నిర్వహించే ఉత్సవమూర్తుల ఊరేగింపు కోసం పల్లకిని సిద్ధంచేశారు. ఇప్పటికే ఉత్సవ మూర్తులను, అలంకరణ అభరణాలను శుద్ధిచేసి వేడుకల నిర్వాహణ కోసం సిద్ధం చేశారు. మందిరాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వేలసంఖ్యలో భక్తులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం నుంచి శనివారం వరకు కొనసాగే ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతినిత్యం రాత్రి వేళలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. వేడుకలలో భాగంగా సోమవారం అంకురార్పణం, మూలమూర్తులకు అభిషేకం, నిత్యార్చనకార్యక్రమాల నిర్వహణతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19న మంగళవారం నుంచి 23న శనివారం వరకు వివిధ కార్యక్రమాల నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహక కమిటీ తెలిపింది.



పూలతో అలంకరించబడిన ఆలయ ప్రవేశమార్గం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఎన్నిక

కుంటాల,మార్చి17: కుంటాల మండలం తెలంగాణ ఉద్యమకారుల కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా రమేష్‌గౌడ్, అధ్యక్షుడిగా దొనికేన వెంకటేష్, ఉపాధ్యక్షులు మగ్గిడి దిగంబర్, కార్యదర్శిగా పెంట దశరథ్, కోశాధికారిగా తొందూరు రజనీకాంత్, సహ కార్యదర్శిగా బోగ లక్ష్మణ్, జిల్లా సభ్యులుగా జుట్టు మహేందర్, పూస శంకర్, రావుల వనిత, సభ్యులుగా పోశెట్టి, షిందే దత్తు, వాడేకర్ దత్తురాం, షిందే నాగరాజు, గల్లాపురం రమేష్, గోలె గంగాధర్, సిందే రవీందర్, కట్కం రాకేష్, మశ్చేందర్, సిందే అరవింద్, మీడియా ప్రతినిధులుగా సాయిబాబా, జగన్ రెడ్డి, రవి ఎన్నికయ్యారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయలశంకర్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 17: నియోజక వర్గ ప్రజలు ఇచ్చిన అవకాశంతో నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా పాయల శంకర్ గెలుపొందితే పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన కాలనీ వాసులు ఎల్లమ్మతల్లికి మొక్కులు తీర్చుకుంటామని మొక్కుకున్నారు. ఇందులో భాగంగా ఆదివారం కాలనీ వాసులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే పాయలశంకర్ పాల్గొని ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ తమపట్ల కాలనీ వాసులు చూపించిన అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇందులో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, మహేందర్, స్వప్నిల్, జోగు రవి, వేదవ్యాస్, రాష్ట్రపాల్, గొర్లరాము, అశోక్ రెడ్డి, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారం శాశ్వతం కాదు..

జైనథ్: రాజకీయంలో చిరకాల మిత్రులు, చిరకాల శత్రువులు ఎప్పుడూ ఉంటా రని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, కానీ రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయ ల శంకర్ స్పష్టంచేశారు. ఆదివారం జైనథ్ మండలంలోని పూసాయి గ్రామంలో గల రేణుకా మాత ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి డప్పులు భజాల మధ్య ఎల్లమ్మతల్లికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజలు పాడి పంటలతో చల్లంగా ఉండాలని ఎల్లమ్మ తల్లికి మేకలు కోళ్లను బలిచ్చి ప్రత్యేక మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పూసాయి గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూసాయి గ్రామతాజా మాజీ ఎమ్మెల్యే ఎడ్మల పోతారెడ్డి, పూసాయి గ్రామ బీజేపీ నాయకులు దోశెట్టి గంగాధర్, బుద్దె సంజీవ్, బుర్రి చిన్నయ్య, బుర్రి శాలుక్‌రావ్‌లతో పాటు స్థానిక నాయకులు, పూసాయి గ్రామ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో కలిసి ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

పోస్టాఫీసు ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఇచ్చోడ, మార్చి18: ప్రజలకు శుద్ధజలం, చల్లని తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో పోస్టాఫీసు ఆవరణలో ఇచ్చోడకు చెందిన ఎంపీటీసీ నిమ్మల శివారెడ్డి సొంత ఖర్చులతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి ప్రారంభించి తాగునీటిని అందజేశారు. కాగా, ఆదివారం ఎంపీపీ మాట్లాడారు. కార్యక్ర మంలో వైస్ ఎంపీపీ జాలైజాకు, గట్టు మహేందర్, మామిడి విజయ్, పోస్టాఫీసు సిబ్బంది పాల్గొన్నారు.



కొమురంభీం చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యతో నిలిచిన వాహనాలు



రహదారికి ఇరువైపులా బస్సులు నిలపడంతో ట్రాఫిక్‌జాంలో అవస్థలు పడుతున్న పాదాచారులు, వాహనదారులు



అంబేద్కర్ చౌరస్తాలోని ఓ హోటల్ ముదు రోడ్డుపై ఇలా..

ఇచ్చోడలో నియంత్రణ లేని కూడళ్లు!

● వాహనదారులు, పాదచారులకు తప్పని తిప్పలు

ఇచ్చోడ, మార్చి 18: వాహనదారులు, పాదచారులు ప్రధాన రహదారితో పాటు స్థానిక రోడ్లు దాటాలంటేనే జంకుతున్నారు. ఏవైపు నుంచి ఏ వాహనం దూసుకువస్తుందో తెలియక కూడళ్ల వద్ద వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇది నిత్యతంతుగా మారింది. ఇచ్చోడ మండల కేంద్రం నుంచి బజార్‌హత్నూర్, సోనాలకు వెళ్లే కొమురంభీం చౌరస్తా నిత్యం రద్దీగా ఉంటుంది. ట్రాఫిక్ నియంత్రించేందుకు సిబ్బంది కూడా కానరావడంలేదు. ఒకవేళ వచ్చిన వారు ట్రాఫిక్ సమస్యను పట్టించుకోవట్లేదు. శివాజీ చౌరస్తా, సిరిచెల్మ చౌరస్తా ప్రాంతాల్లో పాదచారులు రోడ్డు దాటడానికి కూడా నానా అవస్థలకు గురికావాల్సి వస్తోంది. డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో కూడిన ఈ రహదారికి నిధులు మంజూరైన పనులు ప్రారంభించిన గుత్తేదారు పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఆయా ప్రాంతాల్లో చిన్నపాటి బ్రిడ్జిలు కట్టడంతో రోడ్డుపై దుమ్ము లేచి వాహనదారులకు తీవ్ర అవస్థలకు గురిచేస్తోంది.

● పార్కింగ్ సౌకర్యం లేక రోడ్డుపైనే..

చుట్టూ ఆసుపత్రులు, వాణిజ్య సాముదాయాలున్నా వీటికి ఎక్కడా పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏరడుతుంది. సోమవారం సంత కావడంతో రోడ్డుకు అడ్డంగా వ్యాపారులు వాహనాలను నిలిపి ఉంచడంతో గంటల తరబడి రోడ్డుపైనే వాహనాలు నిలిచి వాహనదారులకు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. రోడ్డుపై గంటల తరబడి వాహనాలు నిలిచిన పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం. కనీసం రోడ్డుపై ట్రాఫిక్ నియంత్రించేందుకు ట్రాఫిక్ సిబ్బంది కూడా ఉండకపోవడం కోసమెరుపు. ఇదిలా ఉండగా.. ప్రతీ సోమవారం సంత రోజైనా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవు

● ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్

నేరడిగొండ మార్చ్ 17: ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులపట్ల ఉపాధ్యాయులు అశ్రద్ధ వహిస్తె చర్యలు తప్పవని ఐటిడిఎ డిప్యుటి డైరెక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. శనివారం ఆశ్రమ పాఠశాలలో 40 మంది విద్యార్థినులు వాంతులు చెసుకొగా ఎందుకు వాంతులు చేసుకున్నారని దానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో బయటి నుంచి తిను భండారాలకు అనుమతులు ఇవ్వరాదన్నారు, తాగునీటి శుద్ధజల ప్లాంటు ఎందుకు పని చేయడం లెదని వెంటనే రిపేరు చేయించి తాగునీరు అందించాలని అప్పటివరకు వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించాలని ఆదేశించారు. పదవ తరగతి పరీక్షలంటే భయపడకుండా రాయాలని విద్యార్థులను కోరారు. ఆనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏటీడీవో అమిత్ కుమార్, జీసీడీవో మెస్రం ఛాయ, ఉపాధ్యాయులు ఉన్నారు,



రికార్డులను పరిశీలిస్తున్న ఐటీడీఏ డిప్యుటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతూ..

కార్మిక సమస్యల పరిష్కారంలో ముందంజ

శ్రీరాంపూర్, మార్చి 17: కార్మిక సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉన్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య అన్నారు. ఆదివారం ఆయన నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. సింగరేణిలో యువతకు ఉపాధి లభించాలంటే కొత్తగనులు రావాలని, బొగ్గు గనుల వేలంలో సంస్థ పాల్గొనాలని కోరారు. ఖాళీగా ఉన్న క్లర్కులు, ఈపీ ఆపరేటర్స్, తదితర ఇంటర్నల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాల న్నారు. ఎగ్జిక్యూటివ్ పోస్టులను 60శాతం(ఎక్స్‌టర్నల్), 40 శాతం(ఇంటర్నల్)గా కాకుండా, 40శాతం (ఎక్స్‌టర్నల్), 60శాతం (ఇంటర్నల్)గా ఇవ్వాలన్నారు. డిపెం డెంట్ల ఉద్యోగ వయస్సును 35నుంచి 40ఏళ్లకు పెంచేలా కృషి చేస్తామన్నారు. దీనివల్ల 600 మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. మారు పేర్ల మార్పిడి గురించి సీఎండీని కలిశామని, త్వరలో పేర్లమార్పిడి జరుగుతుందన్నారు. మైనింగ్ స్టాఫ్‌కు సేమ్ జాబ్ ఇవ్వాలని, ఇంటి రుణాల మంజూరుతోపాటు వడ్డీ చెల్లించేలా చూస్తామన్నారు. సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టుల్లో అన్ని కేటగిరీలకు అవకాశం కల్పించాలని మేనేజ్‌మెంట్‌ను కోరామన్నారు. కొంతమంది మేనేజర్లు పాత గుర్తింపు యూనియన్ వారికి సహకరిస్తున్నారని, వారి విధానం మార్చు కోవాలని సూచించారు. సమావేశంలో యూనియన్ డిప్యూటీ కార్యదర్శి కె వీరభద్రయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, నాయకులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో చెక్ పోస్టుల ఏర్పాటు

చింతలమానేపల్లి, మార్చి 17: మండలంలోని గూడెం గ్రామ సమీపంలోగల రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టును ఏర్పాటు చేశామని ఎస్సై నరేష్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలకోడ్ నేపథ్యంలో ముమ్మ రంగా తనిఖీలు నిర్వహి స్తామ న్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ప్రతిఒక్కరు తప్పకుండా పాటించా లని సూచించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది, పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వాడ వద్ద చెక్ పోస్టు..

దహెగాం: మండలంలోని కల్వాడ గ్రామంలో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చెక్ పోస్టును ప్రారంభించినట్లు ఎస్సై రాజు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనాల తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. రశీదులు లేకుండా రూ.50వేల కంటే అధికనగదు తరలిస్తే సీజ్ చేస్తామన్నారు.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, మార్చి 17: మండల కేంద్రంలోని హేటిగూడకు చెందిన కెద్కుర్ సుధాకర్ గుడుంబా విక్రయిస్తున్నాడన్న ముందస్తు సమాచారంతో ఎస్సై నరేష్ ఆదివారం తనిఖీచేశారు. ఈతనిఖీలో ఆరు లీటర్ల గుడుంబా పట్టుబడగా స్వాధీనం చేసుకుని సుధాకర్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



బాలుడికి వీల్‌చైర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, మార్చి 17: నడవడానికి సైతం వీలుకాని బాలుడిని చూసిన ఆ ఎమ్మెల్యే మనసు ద్రవించింది. చిన్నతనంలోనే అవిటి తనంతో బాధపడుతున్న బాలుడిని చూసిన ఎమ్మెల్యే ఇచ్చిన మాటకు కట్టుబడి సహాయం అందించి వీల్‌చైర్ ద్వారా కదిలేలా చేశారు. ఉట్నూర్ మండలకేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన అజయ్ అనే బాలుడు నరాల బలహీనతతో నడవలేని స్థితిలో గత కొంత కాలంగా బాధపడుతున్నాడు. ఇటీవల ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పొద్దు పొడుపు-బొజ్జన్న అడుగు కార్యక్రమంలో భాగంగా శాతినగర్ కాలనీలో తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న క్రమంలో అజయ్ అనే బాలుడు నరాల బలహీనతతో బాధపడుతు ఎక్కడికీ కదలలేని స్థితిలో ఉన్న బాలున్ని చూసి చలించి పోయారు. ఈ బాలునికి ఏమైనా చేద్దామని అనుకున్నాడు. మానవత దృక్పథంతో ఆ బాలుడికి ఆదివారం వీల్ చైర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆ బాలుడి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. తమ కుమారుడిని ఇంత వరకు ఎవరు పట్టించుకోలేదని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ బాలుడి బాధను తెలుసుకకుని సమస్యను పరిష్కరించడం ఆనందంగా ఉందని బాలుడి తల్లిదండ్రులున్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో సమావేశమైన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే

తాంసి, మార్చి 17: తాంసి మండలంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం పర్యటించారు. మండలంలోని పొన్నారిలో రోడ్డు ప్రమాదంలో స్వామి కుటుంబంతో పాటు, కప్పర్ల గ్రామంలో విద్యుత్ షాక్‌తో మరణించిన రైతు అక్షయ్ కుటుంబాన్ని పరామర్శించారు. అంతకు ముందు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రమాదశాత్తు చనిపోయిన స్వామి, అక్షయ్ కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని, వారి మరణం దురదృష్టకరమని అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు బీజేపీ కుట్రేనని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ అరుణ్, జడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీలు శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

భళే.. వాటర్ యాపిల్..!

● జిల్లాలో వాటర్ యాపిల్ సాగు ● లాభాలు గడిస్తున్నరైతు బాలాజీ



ధనోరాలో సాగు చేస్తున్న వాటర్ యాపిల్

చెట్టుపై వాటర్ యాపిల్ పండ్లు



కెరమెరి, మార్చి 17: మండలంలోని ధనోర గ్రామానికి చెందిన రైతు బాలాజీ మరోమారు తనకంటూ ప్రత్యేక చాటుకుంటున్నాడు. గతంలో యాపిల్ సాగు చేసి రాష్ట్ర ఉత్తమరైతుగా ఎంపికై అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకొని ప్రత్యేకగుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి కొత్తగా వాటర్ యాపిల్ మొక్కలను జిల్లా ప్రజలకు పరిచయం చేసి లాభాలు గడిస్తున్నారు.

వాటర్ యాపిల్ సాగు..

రైతు బాలాజీ కేరళ నుంచి 2015లో నాలుగు వాటర్ యాపిల్ మొక్కలను (ఒక్కో మొక్క రూ.120)కి కొనుగోలు చేసి నాటాడు. ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా ఎప్పటికప్పుడు నీటిని అందించగా మొక్కలు ఏపుగాపెరిగాయి. 2022లో పండ్లు, కాయలుపడ్డాయి. యేటా ఫిబ్రవరి, ఏప్రిల్‌లో దిగుబడి వస్తుందని, ఒక్కో మొక్క సుమారు క్వింటాలు దాకా పండ్లు కాస్తాయని చెబుతున్నాడు. ఈ ఏడాది ప్రస్తుతం కోతదశలో ఉన్నాయని ఇప్పటివరకు 50 కిలోల వరకు కిలో రూ.60 చొప్పున విక్రయించినట్లు తెలిపాడు. ఎలాంటి శ్రమ, పెట్టుబడి లేకుండా మంచి ఆదాయం పొందవచ్చని రైతు పేర్కొంటున్నాడు.

పెట్టుబడి లేకుండా ఆదాయం..

● కేంద్రె బాలాజీ, రైతు



ధనోరాలో యాపిల్ సాగు చేసి రాష్ట్ర స్థాయిలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాను. మళ్లీ ఏదైనా కొత్తరకం పంట సాగు చేయాలనుకున్నా. కేరళ రాష్ట్రంలో సాగు చేస్తున్న వాటర్ యాపిల్ గురించి తెలుసుకుని 2015లో నాలుగు మొక్కలు తెచ్చి నాటాను. ఈ ప్రాంతంలో ఉన్న వాతావరణ పరిస్థి తుల్లో పెరుగుతాయో లేదో అనుకున్నా. ఎలాంటి క్రిమిసంహారక మందులు లేకుండా నిత్యం నీటిని అందించడంతో ఏపుగా పెరిగాయి. గతేడాది నుంచి కాత వస్తోంది. ఇప్పటికే రెండుసార్లు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది ఇది మూడోసారి. మంచి లాభాలు వస్తున్నాయి. మరిన్ని మొక్కలు తెప్పించి సాగు చేయాలనుకుంటున్నా.



ఆదిలాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో

పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

● జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత

ఆదిలాబాద్ అర్బన్: పదవ తరగతి వార్షిక పరీక్షల కోసం పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈవో ప్రణీత పేర్కొన్నారు.ఈ నెల 18 నుంచి ప్రారంభంకానున్న పదవతరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.



● ఉట్నూర్‌లోని పదవ తరగతి పరీక్షా కేంద్రం

'పది'కి.. సర్వం సిద్ధం



- జిల్లాలో నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం
- పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- సిబ్బంది నియామకం.. కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు
- నాలుగు స్క్వాడ్ బృందాలు
- సెల్‌ఫోన్లు, ఎలాంటి ఎలాక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు
- విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ టైం
- హాల్‌టికెట్‌తో ఆర్టీసీ బస్సు సౌకర్యం
- పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న 10,511 మంది విద్యార్థులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 53 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ఉట్నూర్, మార్చి 17: తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు పదవ తరగతి పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి ప్రారంభంకానున్న పదవ తరగతి పరీక్షలను ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి, పరీక్షల నిర్వాహకులతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా ప్రత్యేక టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు.

ఎలక్ట్రానిక్ పరికరాలకు నో ఎంట్రీ

పదవ తరగతి పరీక్ష కేంద్రాలలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు సెల్‌ఫోన్‌లను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. సోమవారం నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగనున్న పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వద్ద మొబైల్ ఫోన్లు కాని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు కానీ అనుమతించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు

జిల్లాలో జరుగనున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్న 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులతో పాటు సిబ్బంది పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచనలు చేశారు.

144 సెక్షన్ అమలు

జిల్లాలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. పరీక్షల్లో కాపీయింగ్ ప్రోత్సహించడానికి బయట నుంచి ఎవరు వచ్చినా.. అనుమతించకుండా ఉండేందుకు యంత్రాంగం ఈ చర్యలు తీసుకుంటుంది. పరీక్ష కేంద్రాల వద్ద ఎవరు గుమిగూడి ఉన్నా.. వారిపై పోలీసు లు కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి. దీనికి తోడు పరీక్ష నడిచే సమయంలో ఆయా ప్రాంతాలలోని స్థానిక జీరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని సంబంధిత జిల్లా అధికారులు ఇప్పటికే ఆయా మండలాల తహసీల్దార్లను ఆదేశించడం జరిగింది.

నిర్లక్ష్యం చేస్తే.. కఠిన చర్యలు

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తూ పరీక్షల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అధికారులు స్పష్టం చేశారు. అందుకు తగిన ఆదేశాలను సైతం జారీ చేశారు. కాపీయింగ్‌కు ప్రోత్సహించే వారిపై కఠిన నిర్ణయాలు ఉంటాయని ఉన్నత అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఐదు నిమిషాల గ్రేస్ టైం

సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా.. గతంలో ఒక నిమిషం నిబంధనకు బదులు ఐదు నిమిషాల వరకు విద్యార్థులను అనుమతించడం జరుగుతుందని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అయితే, పేపర్ లీక్ వంటి పరిణామాలు జరుగకుండా గట్టి చర్యలు చేపట్టాలని కఠిన నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఇన్విజిలేటర్లు ముందుగానే..

పదవ తరగతి పరీక్షలకు నియామకమైన ఇన్విజిలేటర్స్ ఉదయం 8గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు సిద్ధం, విద్యార్థులు బ్లూ బ్లాక్ పెన్స్ మాత్రమే వాడాలి. పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు బ్లూ, బ్లాక్ పెన్స్ మాత్రమే వాడాల్సి ఉంటుంది. ఓఎంఆర్ షీట్స్ విద్యార్థులకు అందించే సమయంలో ఇన్విజిలెటర్లు జాగ్రత్తలు పాటించాలని ఆదేశాలు అందాయి.

సీసీ కెమెరాల ఏర్పాటు

జిల్లాలోని ఆయా మండలాల్లో 10వ తరగతి పరీక్షలు జరిగే అన్ని పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అధికారులు ముందుగా సీసీ కెమెరా ఫుటేజ్ రికార్డు అవుతుందా? లేదా? చెక్ చేసుకుని పరీక్షలకు సంబంధించిన ప్రతీది సీసీ కెమెరాల సమక్షంలోనే జరగాలని ఉన్నత అధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాలు అందాయి.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పన

పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పరీక్షా కేంద్రాలలో తాగునీరు, ఫర్నిచర్ లాంటి అన్ని సదుపాయాలు ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా టాయిలెట్స్ శుభ్రంగా ఉంచాలని, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. హాల్‌టికెట్ తీసుకోని వారు వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు.

గత అనుభవాల దృష్ట్యా..

గత సంవత్సరం జరిగిన పదవ తరగతి పరీక్షల సమయంలో ఉట్నూర్ తపాలా శాఖ అధికారుల నిర్లక్ష్యం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా పరీక్షలు పూర్తయ్యాక పరీక్షా పత్రాలను పోలీసు బందోబస్తుతో తపాలా కార్యాలయానికి తరలించాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన అన్ని మందులతో పాటు వారికి వోఆర్ఎస్ ప్యాకెట్లతో సహా వైద్య బృందాల ఏర్పాటు, అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాను అందించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సకాలంలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థుల కోసం బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు అందాయి. కాగా, జిల్లాలో పదవ తరగతి పరీక్షల కోసం 53 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ పరీక్షలను మొత్తం 10,511 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. అంతేకాకుండా పదో తరగతి పరీక్ష కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలెటర్లు, సిట్టింగ్ స్క్వాడ్‌తో పాటు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు.

సంక్షిప్త సమాచారం



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

ఎయిడ్స్‌పై అవగాహన

తాంసి, మార్చి 17: ప్రస్తుతం హెచ్ఐవీ పట్టి పీడిస్తోందని, అవగాహన లోపంతో ఈ వ్యాధి సోకడం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో కళాజాతా బృందంతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పాటలు, పద్యాలు, నృత్యాల రూపంలో యువతకు అవగాహన కల్పించారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి : ఎంఈవో

జైనథ్, మార్చి 17: మండలంలోని గిమ్మా, పెండల్‌వాడ, జైనథ్ పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎంఈవో శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జైనథ్ ప్రభుత్వ ఉన్నత ఆదర్శ పాఠశాలలో రెండు కేంద్రాలలో 340 మంది విద్యార్థులు గిమ్మా(కె)లో గూడ పిప్పర్‌వాడ, గిమ్మా గ్రామాలకు సంబంధించిన 220 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పెండల్‌వాడ పరీక్ష కేంద్రంలో అడ, బాలాపూర్, పెండల్‌వాడ,కౌట ఉన్నత పాఠశాలలకు సంబంధించిన 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తం 660 మంది విద్యార్థులు చీఫ్ సూరింటెండెంట్లు నలుగురు డిపార్ట్‌మెంట్ అధికారులు, నలుగురు కస్టోడియన్‌లు ఇద్దరు, ఇన్విజిటెలర్స్ 43 మందిని నియమించారు. అంతేకాకుండా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వ హించే ఈ పరీక్షలో 114 నియమించిన ఉంటుందని ఎంఈవో తెలిపారు.

పరీక్ష అట్టల పంపిణీ

నేరడిగొండ, మార్చి 17: ముత్యాలీబాయి హమ్ము నాయక్ వెల్ఫేర్ సొసైటీ వెంకటాపూర్ తరపున ఎస్ఎస్‌సీ విద్యార్థినిలకు ఎగ్జామ్‌ప్యాడ్స్ పెన్స్ బహూకరించారు. నేరడిగొండ మండలంలోని కేజీబీవీ ఉన్నత పాఠశాల (బాలికలు) నేరడిగొండలోని ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరవుతున్న 40 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్స్‌లను సొసైటీ అధ్యక్షుడు ఆడేనూర్ సింగ్‌నాయక్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు కష్టపడి చదివి మంచి మార్కులతో పాస్ కావాలని కోరారు. ఇందులో హెచ్ఎం కేజీబీవీ ఎస్ఏ రజిత, ఉపాధ్యాయులు, సొసైటీ సభ్యులు అర్జున్, ఆడే అక్షయనాయక్, ఆడే హర్షిత్‌నాయక్, శివచరణ్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షా అట్టలను అందజేస్తున్న దృశ్యం

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషా
- ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో పేరు సరి చూసుకోవాలి
- అక్రమంగా నగదు, లిక్కర్ సరఫరా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు : జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం
- చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 17: భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజార్షిషా కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సందర్భంగా ఆదివారం జిల్లా కలెక్టర్ రాజార్షిషా, జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాజార్షిషా మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్‌విడుదల చేసిందన్నారు. ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటిని, ఏప్రిల్ 29 వరకు నామినేషన్లకు ఉప సంహరణ గడువు ఉంటుందని తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతీఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్‌కు రెండు కిలోమీటర్ల రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచేవిధంగా వ్యాఖ్యలు చేయడం నిషేదమని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలు లేదని సూచించారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సీ -విజిల్ యాప్ ద్వారా చేయవచ్చన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరించేందుకు 24గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సీ -విజిల్ యాప్‌లో లైవ్ వీడియో అప్‌లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకుని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫొటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24గంటల వ్యవధిలో, బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్ పెట్రోల్‌బంక్ తదితర పబ్లిక్ స్థలాల్లో 48గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలల్లో 72గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదే విధంగా ఎవరు ప్రింట్ చేయమన్నారు వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.



● విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

● 24గంటల పాటు గట్టి నిఘా : ఎస్పీ గౌస్‌ఆలం

అనంతరం జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో అవసరమైన మేర 6 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటల పాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దని, ప్రతీరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని ఎస్పీ తెలిపారు. ఇందులో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరి

● రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశంలో కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 17: ఎన్నికల సంఘం నిబంధనలను ఆయా రాజకీయ పార్టీలు పాటించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి రాజార్షిషా అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన సందర్భంగా ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీగౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవిలతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల సమావేశాలకు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రశాంతవంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల సందర్భంగా సువిధ పోర్టల్‌లో రాజకీయ నాయకులు అనుమతులు తీసుకోవాలని, ర్యాలీల సందర్భంగా భారీ శబ్ధంతో కూడిన డీజే సౌండ్‌లు నిషేధమని తెలిపారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడవద్దని, స్వీయ నియంత్రణకు కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ స్థలంలో రాజకీయ ప్రచార పోస్టర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రైవేట్ ప్రాంతాలలో రాజకీయ పోస్టర్లు ఏర్పాటు చేస్తే వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలన్నారు. టోల్ ఫ్రీ నెం.8712659973కి కాల్ చేయవచ్చని తెలిపారు.



ఎన్నికల్లో బీజేపీకి గట్టి బుద్ధి చెప్పాలి : డీసీసీబీ చైర్మన్

● తాత్కాలికంగా రైల్వేలైన్ సాధన కమిటీ రిలే దీక్షల విరమణ

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 17: బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణి అవలంభిస్తోందని, పార్లమెంట్ ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెప్పాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలు పట్టని ఆ పార్టీకి ఎవరు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్ సాధనకోసం స్థానిక ఆర్ అండ్‌బి అతిథిగృహం వద్ద గత 62 రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షను ఆదివారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా విరమించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ హాజరై శిబిరంలో దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ జిల్లా పర్యటనకు వచ్చి ఆదిలాబాద్ అభివృద్ధి కోసం ఏం ప్రకటించారని నిలదీశారు. స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలు ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్‌తో పాటు సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణ అంశాలను బహిరంగ సభ వేదిక సాక్షిగా పీఎం మోదీ దృష్టికి తీసుకెళ్తే ఆయన మాట్లాడకుండా వెళ్లిపోయారన్నారు. కాగా ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలోనే ఈ రిలే దీక్షలను తాత్కాలికంగా విరమణ చేస్తున్నామని, ఎన్నికలు పూర్తవగానే మళ్లీ యధావిధిగా చేపడతామని రైల్వేలైన్ సాధన సమితి చైర్మన్ సిర్ర దేవేందర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్‌లు తెలిపారు. ఇందులో బాయిన్‌వార్ గంగారెడ్డి, మహ్మద్ రఫీక్‌తో పాటు రైల్వేలైన్ సాధన సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేస్తున్న డీసీసీబీ చైర్మన్, నాయకులు